www.prajasakti.com


ప్రజాశక్తి

ఆదివారం 9 నవంబర్ 2025

5

తిరుపతి





రామకుప్పంలో హాజరైన కూటమి నేతలు



గోదాముల్లో ఎర్రచందనం క్వాలిటీ పరిశీలిస్తూ...

ఎర్రచందనం పరిరక్షణకు..

'కగార్' తరహా ఆపరేషన్

• స్మగ్లర్లకు పవన్‌కల్యాణ్ హెచ్చరిక

• నలుగురు కింగ్‌పిన్ స్మగ్లర్లు గుర్తింపు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అడవులలో మాత్రమే వద్ధి చెందే ఎర్రచందనం చెట్లను నరికి కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్న కింగ్ పిన్ స్మగ్లర్లు, ఇకపై శేషాచలం అడవుల వైపు వస్తే భయం కలిగేలా ఆపరేషన్ కగార్ తరహాలో ఎర్రచందనం పరిరక్షణ కోసం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ స్మగ్లర్లకు హెచ్చరికలు జారీ చేశారు. తిరుపతి పర్యటనలో భాగంగా శనివారం ఉదయం మామండూరు అటవీ ప్రాంతాన్ని జిల్లా అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. తిరుపతి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి సర్కిల్ అటవీ శాఖ సిసిఎఫ్ సెల్వం, జిల్లా అటవీ శాఖ అధికారి సాయిబాబా తదితరులు స్వాగతం పలికారు. మామండూరు అటవీ ప్రాంతాన్ని పరిశీలించే క్రమంలో ఆ ప్రాంతంలో అరుదుగా కనిపించే మొక్కలను మంత్రి పవన్ కళ్యాణ్ పరిశీలనాత్మకంగా చూసి వాటి గుణగణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలానే స్మగ్లర్లు నరికి వేసిన ఎర్రచందనం చెట్లను పరిశీలించారు. వ్యూ పాయింట్ ద్వారా మామండూరు అటవీ ప్రాంతాన్ని పవన్ కళ్యాణ్ పరిశీలించారు. మామండూరు అటవీ ప్రాంతంలో సహజంగా పారే కాలువ వద్ద కొద్దిసేపు ఉపముఖ్యమంత్రి ఉల్లాసంగా గడిపారు. మామండూరు అటవీ క్షేత్ర ప్రాంతం విశిష్టతను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వేలకోట్ల సంపద గోదాముల్లో..

మామండూరు అటవీ ప్రాంతం పర్యటన అనంతరం తిరుపతి-కరకంబాడి మార్గం తిమ్మి నాయుడు పాలెం వద్ద ఉన్న కేంద్రీయ ఎర్రచందనం గోదామును పరిశీలించారు. అక్కడ ఉన్న 5300 టన్నుల ఎర్రచందనం దుంగలను పరిశీలించిన మంత్రి వీటి అంచనా విలువ ఎంత ఉండొచ్చు అని అధికారులను అడగగా, 2 నుంచి 5 వేల కోట్ల రూపాయలు ఉంటుందని చెప్పడంతో పవన్ కళ్యాణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కేంద్రీయ ఎర్రచందనం గోదాములలో ఉన్న ఎనిమిది గోదాములలో పట్టుబడిన ఎర్రచందనం రికార్డులను, ఎర్రచందనం ద్వారా ఉత్పత్తి చేసిన వివిధ రకాల వస్తువులను పరిశీలించడంతోపాటుగా వాటి మన్నికను అడిగి తెలుసుకున్నారు. గోదాములలో ఉన్న ఎర్రచందనంకు దాదాపుగా 28 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ కూడా చేయించామని అధికారులు మంత్రికి వివరించారు. గోదాములలో నిల్వ ఉన్న ఎర్రచందనం ఏ, బి, సి, నాన్ గ్రేడ్లుగా విభజించామని, త్వరలోనే గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయాలు జరపడానికి పరిశీలనలు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

ఒకే వేదికపై తండ్రీకొడుకులు

విధినిర్వహణలో అద్భుత దృశ్యం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



విధి నిర్వహణలో భాగంగా ఒకే వేదికపై తండ్రీ కొడుకులు కనిపించారు. తిరుపతిలో ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తిరుపతి పర్యటనలో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు అటవీ శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ జి.ఆర్. మధుసూదన్ తన విధుల్లో భాగంగా పాల్గొన్నారు. అదే కార్యక్రమంలో ఆయన తండ్రి జి. రామచంద్ర, తిరుపతి అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు. విధి నిర్వహణ పరంగా ఒకే వేదికపై తండ్రి-కొడుకులు కలిసి పనిచేయడం అందరికీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పాలనాపరమైన ప్రభుత్వ సేవా బాధ్యతల్లో తండ్రి-కొడుకులు కర్తవ్యనిష్ఠతో వ్యవహరించడం ప్రభుత్వ యంత్రాంగంలో ఆదర్శంగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం అభినందించారు.

పవన్ పర్యటనలో నిరసన సెగ.....



ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వద్ద శ్రీకాళహస్తి జనసేన పార్టీ మాజీ ఇన్చార్జి వినుత డ్రైవర్ రాయుడు హత్య ఉదంతంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాయుడు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్లే కార్డులు ప్రదర్శించి రాయుడు కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. వీరిని గమనించిన పోలీసులు పక్కకు తీసుకెళ్లిపోయారు. తిమ్మినాయుడుపాలెం వద్ద స్మశాన వాటిక ఏర్పాటు సమస్య ఉందని, అటవీ భూభాగంలో స్మశాన వాటిక ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రజలు పవన్ కళ్యాణ్ పర్యటనలో విజ్ఞప్తి చేయడానికి ప్రయత్నాలు చేశారు. కలెక్టరేట్లో రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంగా ప్రకటించబడిన శ్రీ భక్త కనకదాస 538వ జయంతి సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెంట అటవీ శాఖ ప్రిన్సిపల్ పిసిసిఎఫ్ చలపతిరావు, ప్రభుత్వ అటవీ శాఖ సలహాదారు మల్లిఖార్జున రావు, ఓఎస్ డి శివరాం ప్రసాద్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ, టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు, చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, తిరుపతి సర్కిల్ సిసిఎఫ్ సెల్వం, జిల్లా అటవీ శాఖ అధికారి సాయిబాబా, రెడ్ శాండర్స్ గోదాముల డిఎఫ్ఓ రవిశంకర్ శర్మ అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు 'ముసలిమడుగు'లో పర్యటన

ప్రజాశక్తి - పలమనేరు





ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదివారం పలమనేరు మండలంలో పర్యటించనున్నారు. తన పర్యటనలో భాగంగా తిరుపతి విమానాశ్రయం నుండి బయల్దేరి ఉదయం 10.35 గంటలకు పలమనేరు మండలం పెంగరగుంటకు చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గాన బయల్దేరి 10.50 గంటలకు పలమనేరు సమీపంలోని ముసలిమడుగు ఏనుగు శిబిరం చేరుకుని మానవ - వన్యప్రాణి ఘర్షణ నిర్వహణ, కుంకి ఏనుగుల శిక్షణ శిబిరాన్ని సందర్శించి మొక్కలు నాటతారు. కార్యక్రమం అనంతరం కుంకీ ఏనుగుల శిబిరం, గజారామము నగర వనాన్ని ఉపముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. తదుపరి రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ముసలిమడుగు నుండి పెంగరగుంట హెలిప్యాడ్ చేరుకుని తిరుపతి విమానాశ్రయంకు బయల్దేరి వెళతారు.

పవన్‌కు బొజ్జల స్వాగతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖామాత్యులు పవన్ కళ్యాణ్‌కు స్థానిక రేణిగుంట విమానాశ్రయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్ శనివారం జిల్లా పర్యటన నిమిత్తం రేణిగుంటకు చేరుకోగా సుధీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు.


కుప్పం అభివృద్ధిపై చర్చ జరగాలి

రూ.2,203 కోట్లతో ఏడు పరిశ్రమలు

వర్చువల్‌గా చంద్రబాబు శంకుస్థాపన

వందశాతం సోలార్ పవర్

త్వరలోనే మరో ఎనిమిది ఫ్యాక్టరీలు



ప్రజాశక్తి - కుప్పం

'కుప్పంలో జరుగుతున్న అభివృద్ధిపై ఇంటింట చర్చ జరగాలి' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. రూ.2,203 కోట్లతో ఏడు పరిశ్రమలకు వర్చువల్‌గా శనివారం శంకుస్థాపన చేశారు. సంజీవని పైలెట్ ప్రాజెక్టును కుప్పంలోనే అమలు చేస్తున్నామన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని వందశాతం సోలార్ పవర్ వినియోగించుకునే నియోజకవర్గంగా చేస్తామన్నారు. త్వరలో రూ.6,339 కోట్ల పెట్టుబడితో ఎనిమిది సంస్థలు కుప్పానికి రానున్నాయని చెప్పారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 43వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. చంద్రబాబు మాట్లాడుతూ స్పేస్‌సిటీ, డ్రోన్‌సిటీ, ఎరో స్పేస్‌సిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఒకప్పుడు కుప్పం అత్యంత వెనుకబడిన ప్రాంతమని, ఇపుడు అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ ఏడాదిలో డ్వాక్రా, మెప్మా సంఘాల నుంచి లక్ష మందిని మహిళా పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్, వన్ ఫ్యామిలీ వన్ ఎఐ నిపుణుడు అనే పాలసీలు చరిత్రను తిరగరాస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పీడీ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్‌బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, మండల అధ్యక్షులు సుబ్రమణి, రాజగోపాల్, ఉదయ్‌కుమార్, మాజీ జడ్‌పిటిసి బెటప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడి స్క్రీన్ ద్వారా వీక్షించిన కూటమి నేతలు

ప్రజాశక్తి- రామకుప్పం

కుప్పం నియోజకవర్గంలో రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ఏడు పరిశ్రమలకు వర్చువల్ ద్వారా శనివారం శంకుస్థాపన చేశారు. పోలీస్ స్టేషన్ సర్కిల్ వద్ద ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. కూటమి నేతలు మాట్లాడుతూ... మారుమూల ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలో ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తుంటారని, సీఎం చొరవతో నియోజకవర్గంలో ఏడు పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు మెండుగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అహర్నిశల కషి చేశారన్నారు. 2027 నాటికి పరిశ్రమలు స్థాపనతో నియోజకవర్గం దశా దిశా మారిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, సీతాపతి పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో మహిళ ఆత్మహత్య

ఉగ్గుమూడిలో విషాదం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

కుటుంబ కలహాల కారణంగా ఇద్దరు పిల్లలతో సహా మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సూళ్లూరుపేట మండల పరిధిలోని ఉగ్గుమూడిలో చోటు చేసుకుంది. వరలక్ష్మి (24) తన ఇద్దరు పిల్లలైన వర్షిత్ (4), ప్రశాంత్ (2)లతో పొలాల్లోని బావిలో దూకిన ఘటన శనివారం వెలుగు చూసింది. జేసీబీ సాయంతో మృతదేహాలను వెలికి తీశారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. సిఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.









వరదయ్యపాలెం ఎంపీపీగా పద్మప్రియ

హైకోర్టు స్టేతో యధావిధిగా కొనసాగింపు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

మండల పరిషత్ అధ్యక్షురాలుగా టి.పద్మప్రియ దామోదర్ రెడ్డి యధావిధిగా కొనసాగనున్నారు. ఆమెకు ఈనెల 5వ తేదీ గౌరవ రాష్ట్ర హైకోర్టులో జరిగిన లంచ్ మోషన్ పిటిషన్ లో..ఆమెపై జిల్లా కలెక్టర్ ఇచ్చిన రాజీనామా ఆమోదపు ఉత్తర్వులపై న్యాయస్థానం స్టే విధించినట్లు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల మండల వైఎస్సార్సీపీలో జరిగిన నాటకీయ పరిణామాలలో ఆమెను కుట్ర పూరితంగా దింపేందుకు వివిధ పన్నాగాలతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఒకానొక సందర్భంలో పార్టీ పెద్దల సూచన మేరకు ఆమె రాజీనామాకు సిద్ధపడ్డారు.. అయితే తదుపరి జరిగిన పరిణామాల కారణంగా ఆమె ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. అయితే జడ్పీ సీఈవో పంచాయతీరాజ్ చట్టానికి వ్యతిరేకంగా ఏకపక్ష నిర్ణయంతో ఎంపీపీకి ఎలాంటి నోటీసు ద్వారా గాని, నేరుగా గాని సమాచారం లేకుండా ఎవరి ద్వారానో వెళ్లిన రాజీనామా లేఖను ఆధారంగా తీసుకొని .. రాజీనామాను ఆమోదించే విధంగా జిల్లా కలెక్టర్ కు సిఫార్సు చేయడంతో ..ఆ సిఫార్సు ఆధారంగా జిల్లా కలెక్టర్ ఎంపీపీ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు అక్టోబర్ 31న ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై ఒకింత కలత చెందిన ఎంపీపీ పద్మప్రియ దామోదర్ రెడ్డి న్యాయం కోసం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఈనెల 5న ఆశ్రయించారు. తమ న్యాయవాది ద్వారా లంచ్ మోషన్ లో పిటిషన్ దాఖలు చేయగా ..దానిపై విచారణ చేసిన న్యాయస్థానం తిరుపతి జిల్లా కలెక్టర్ ఇచ్చిన వరదయ్యపాలెం ఎంపీపీ రాజీనామా ఆమోదపు ఉత్తర్వులపై స్టే విధిస్తూ న్యాయమూర్తి జస్టిస్ రవి చీమలపతి తీర్పునిచ్చారుగౌరవ హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు వరదయ్యపాలెం మండల పరిషత్ అధ్యక్షురాలుగా టి పద్మప్రియ దామోదర్ రెడ్డి యధావిధిగా కొనసాగాలన్నారు. అనేక నాటకీయ పరిణామాల మధ్య రెండు గ్రూపులుగా విడిపోయి ఎంపీపీ పదవి కోసం పోటీపడిన ఒక వర్గానికి నిరాశ మిగిలింది.

పర్యవేక్షణ లోపం... ఆ గ్రామాలకు శాపం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

ప్రజాదృష్టి

ఓలూరు రాయలచెరువు గండి విషయంలో నీటిపారుదల శాఖ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కిందస్థాయి అధికారులు, సిబ్బంది తూతూమంత్రంగా చెరువులను పరిశీలించి చేతులు దులుపు కుంటున్నారు. తిన్నామా .. పడుకున్నామా.. తెల్లారిందా అనే సినిమా డైలాగులా వారి పనితీరు ఉంటోంది. వారి నిర్లక్ష్యంతో ఐదు గ్రామాలను వరదనీరు ముంచెత్తింది. అందులో ఓ గ్రామం పూర్తిగా చిద్రమయ్యింది. . ఇది కెవిబిపురం మండలంలోని కళతూరు దళితవాడ, పాతపాళెం గ్రామాల్లో గురువారం ఉదయం పరిస్థితి. కేవలం మూడంటే మూడు గంటల్లో ఐదు గ్రామాలు అతలాకుతలం అయ్యాయి. రెండుగ్రామాల పరిస్థితి వర్ణాతీతం.

తిరుపతి జిల్లా కుమార వెంకట భూపాల పురం (కెవిబిపురం) మండలంలో రెండు కొండల మధ్య 50 సంవత్సరాల క్రితం నిర్మించారు రాయలచెరువు రిజర్వాయర్. 153 ఎకరాల్లో 88 అడుగుల ఎత్తు వరకు సుమారు 0.088 టిఎంసిల నీటినిలవ సామర్థ్యం గలది ఈ చెరువు. సుమారు 1200 ఎకరాల ఆయకట్టు ఉంది. గురువారం వేకువజామున 4-5 గంటల మధ్య ఈ చెరువులో చేపలు పడుతున్న మత్యకారులు చెరువుకు ఒక పక్కన బురదనీరు ఉబుకుతుండడాన్ని గమనించి, హుటాహుటిన అక్కడ నుంచి పరిగెత్తుకుంటూ వెళ్లి కిలోమీటరు దూరంలో ఉన్న ఉప సర్పంచికి విషయాన్ని తెలియజేశారు. ఆయన ద్వారా సర్పంచికి, ఆయన ద్వారా నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమీపంలోని అధికారులు, సిబ్బందితో చెరువు వద్దకు చేరుకునే సమయానికి చెరువుకు పెద్దస్థాయిలో గండి పడింది. దాన్ని ఆపేందుకు ప్రయత్నించారు. కొంత మంది సమీప గ్రామాల్లోకి వెళ్లి గ్రామస్తులను అప్రమత్తం చేసేందుకు పరుగులు తీశారు. గంట వ్యవధిలో చెరువుకు పడిన గండి పరిమాణం పెరిగింది. ఒక్కసారిగా నిమిషాల వ్యవధిలోనే 20 మీటర్లకు పైగా చెరువుకట్ట తెగి, చెరువులోని నీరంత సమీప గ్రామాల్లోకి ప్రవేశించింది. ముందుగా కళాత్తూరు దళితవాడ, పాతపాళెంపైగా ఎస్సి కాలనీ, ఎంఎ రాజుల కండ్రిగ, మహాదేవపురం, కాత్రాపల్లిలో ఈ చెరువు వరద ప్రవేశించింది. అప్రమతమైన అధికారులు పలు కాజ్‌వేల వద్ద రాకపోకలు నిలిపివేయడంతో కొంత ప్రమాదం తప్పింది. ఈ జల ప్రళయానికి కళత్తూరు, పాతపాళెం పూర్తిగా దెబ్బతిన్నాయి. 3 నుంచి 4 గంటల వ్యవధిలో చెరువు మొత్తం ఖాళీ అయ్యింది. ముంపు గ్రామాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ఈ ప్రళయంలో 2 వేల ఎకరాల పంట పొలాలు ఇసుక మేటలు వేసినట్లు తయారయ్యాయి. 900కు పైగా పశువులు, వందలాది వాహనాలు, బైకులు, ట్రాక్టర్లు, కారులు, వ్యవయసాయ మిషన్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి. 23 పూరిళ్లు, 9 మిద్దె ఇల్లు దెబ్బతిన్నాయి, 60 పాకలు కొట్టుపోయయి. 90 విద్యుత్ స్తంబాలు, 20కి పైగా విద్యుత్ స్తంభాలు వరదలో కూలిపోయాయి. కేవలం ఒక కళాత్తూరులోనే 700 కుటుంబాలు నిరాశ్రయులయ్యారు అంటే పరిస్థితి ఎలా ఉందో అర్ధమవుతుంది. వంద కోట్లకు పైగా పంట, ఆస్థి, పశువుల నష్టం జరిగినట్లు తెలుస్తోంది. అధికాకారులు మాత్రం 30 కోట్లు మాత్రమే నష్టం జరిగినట్లు అంచనా వేసేశారు.

అంతా నిర్లక్ష్యమే...!

50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ చెరువుకు చివరిగా 2014-15లో నీరుచెట్టు పథకం కింద కేవలం పూడికతీత పనులతో సరిపెట్టారు. చెరువుకట్ట బలోపేతానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా గతంలో ఇదే చెరువు వద్ద తూముకు అడ్డుకట్ట వేస్తూ రమేష్ అనే రైతు మరణించాడు. చెరువు కట్టకు బొగడ ఏర్పడంతో అధికారులు దాన్ని పూడ్చారు. గురువారం ఉదయం మరోసారి బొగడ ఏర్పడడంతో దాన్ని నిలవరించలేక పోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కానీ అధికారులు మాత్రం తాము నిత్యం పరిశీలిస్తున్నాం. చెరువుకట్ట బాగానే ఉందని, ఉన్నపళంగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది అని సమాధానం చెప్పడం కొసమెరుపు. ప్రమాదం తర్వాత కలెక్టరు ఆయా గ్రామాల్లో పర్యటించడంతో, నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. కింత స్థాయి అధికారి నిర్లక్ష్యం ఉందని నిర్ధారణ చేసి కలెక్టర్కు నివేదించారు. అందుకు బాధ్యులను చేస్తూ ఏఈ బాబును సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టరు ప్రకటించారు. రాష్ట్రాన్ని వణికించిన మొంథా తుపాన్ ప్రభావం తర్వాత కూడా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకపోగా, కిందస్థాయి సిబ్బందిపై నెపం వేయడం విడ్డూరం. ఏది ఏమైనా జరిగిన ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను పూర్తిస్థాయిలో వెనువెంటనే అదుకుని, వారికి జీవన మార్గాన్ని చూపాలి. నష్టపరిహారాన్ని తూతూ మంత్రంగా కాకుండా పూర్థిస్థాయిలో చెల్లించాలి. బాధితులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం లేకుండా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, చొరవ చూపుతారని ఆశిద్దాం..!



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..



పారిశుద్ధ్య కార్మికులు

పొంచి ఉన్న మరో ముప్పు



శ్రీకాళహస్తి : ఒక ముప్పు మిగిల్చిన విషాదం నుంచి కోలుకుంటున్న కళత్తూరుకు మరో ముప్పు పొంచి ఉంది. కళత్తూరుకు అతి సమీపంలో ఎగువ భాగాన ఉన్న కొత్త చెరువు కట్ట బలహీనంగా మారడంతో గండ్లు పడే అవకాశం ఉంది. కట్టకు ఓ చోట చిన్నపాటి రంధ్రం ఏర్పడటంతో గ్రామస్తులు శుక్రవారం రాత్రి పరుగున వెళ్లి కేవీబీపురం మండల కేంద్రంలో తలదాచుకున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు గ్రామస్తుల సాయంతో గండి పెద్దది కాకుండా మరమ్మత్తులు చేశారు. ప్రస్తుతం కొత్త చెరువులో 90 శాతం మేర నీటి నిల్వలున్నాయి. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే చెరువు మొరవ పారే అవకాశం ఉంది. ఈ క్రమంలో కట్ట ఏయే ప్రాంతాల్లో బలహీనంగా ఉందో ఇరిగేషన్ అధికారులు ముందుగానే గుర్తించాల్సిన అవసరం ఉంది.



సిపిఎం ఆధ్వర్యంలో సహాయక చర్యలు

కళత్తూరు దళితవాడలో సిపిఎం సహాయ చర్యలు

ప్రజాశక్తి - కెవిబిపురం

ముంపుకు గురైన కళత్తూరు దళితవాడలో సిపిఎంజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ నేతృత్వంలో సేవా కార్యక్రమాలను శనివారం చేపట్టారు. రోజంతా శ్రమించి కాలనీలోని ఐదు ఇళ్లలోని బురదను పూర్తిగా తొలగించారు. విద్యార్థిసంఘం ఎస్ఎఫ్ఐ నుంచి 30 మంది యువతీ యువకులు కాలనీలోని 15 కుటుంబాల్లో బురదను తొలగించారు. ఈ కార్యక్రమంలో కెవిబిపురం మండల కార్యదర్శి నాగరాజు, సత్యవేడు కార్యదర్శి మెలుగు రమేష్, నాగలాపురం నాయకులు మురగేష్, నారాయణవనం నాయకులు మునిశంకర్, ఏర్పేడు నాయకులు బాలకృష్ణ, సత్యవేడు మండలం నుంచి భాస్కర్, కృష్ణయ్య, వెంకటేష్, కెవిబిపురం మండలం నుంచి శంకరయ్య సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


పాతపాలెం అరుంధతివాడపై నిర్లక్ష్యం తగదు

కెవిబిపురం మండలంలోని పాతపాలెం అరుంధతివాడపై అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని దాసరి జనార్ధన్ విమర్శించారు. శనివారం పాతపాలెం అరుంధతివాడను సిపిఎం బృందం పరిశీలించింది. తమకు రెవెన్యూ అధికారులు ఎటువంటి సాయం చేయడం లేదని, నిత్యావసరాలు అందించడం లేదని బాధితులు సిపిఎం దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణంలోనూ మూడు రోజులవుతున్నా పట్టించుకోలేదని, కాలనీ నుంచి బయటకు రావాలంటే అవస్థలు పడుతున్నామని దళితులు వాపోయారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఓలూరు రాయలచెరువుకు గండి పడడం కారణంగా ముంపుకు గురైన ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశామని ఎపిఎస్పిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలోని కెవిబి పురం మండలం, పాతపాలెం వద్ద వున్న ఓలూరు రాయల చెరుపుకు గండి పడడంతో కెవిబిపురం 33/11కెవి సబ్ స్టేషన్ నీట మునిగిందని, తద్వారా కలత్తూరు, ఎస్ఎల్ పురం, పిసికె పురం, రంగయ్య గుంట, రాజులకండ్రిగ, కొటాల మిట్ట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. వరద కారణంగా 223 విద్యుత్ స్తంభాలు, 78 ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతినడంతో 2,093 (గృహ, వ్యవసాయ, తాగునీటి సరఫరా) సర్వీసులకు సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో వరద ప్రభావం తగ్గిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను చేపట్టామని తెలిపారు.



బాధితులకు లక్ష రూపాయలు ఇస్తామని దాతృత్వం ప్రకటించిన రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మాజీ సీఎం జగన్ ఆదేశాలతో, సత్యవేడు నియోజకవర్గ ఇంచార్జ్ నూకతోటి రాజేష్ సూచనలతో, బి.ఎన్. కండ్రిగ మండల అధ్యక్షుడు కె.మణి నాయుడు నాయకత్వంలో కోటి సంతకాల సేకరణ మరియు రచ్చబండ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల క్రియాశీలక కార్యదర్శి కొన్నెల గోపాల్ రెడ్డి, వైస్ ఎంపిపి బాబు రెడ్డి, సంజీవయ్య ఇతర నాయకులతో కలిసి కొత్తపాళ్యం, పల్లమాల, పార్లపల్లి, భావని శంకరాపురం గ్రామాలలో ప్రజలతో కలిసి కోటి సంతకాల సేకరణ చేపట్టి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిరంజన్ రెడ్డి, అమరనాథ్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోట: కోట మండలం, నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళా భవన్‌లో శనివారం ఎమ్మెల్సీ మేరిగ మురళి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం అయినట్లయితే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందని తెలిపారు. కోటి సంతకాల సేకరణ ద్వారా ప్రతి ఒక్కరు నిర్ణయాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలగాటి సంపత్ రెడ్డి, వరదారెడ్డి, దేవా రెడ్డి నాగార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలు వైద్య విద్యకు దూరం : కాంగ్రెస్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని, ఈ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం పునః పరిశీలన చేయాలని కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాల గుర్రం బాబు కోరారు. గూడూరు పట్టణంలోని ప్రైవేట్ హోటల్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల గుర్రం బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పి.పి.పి పద్ధతిలో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తుందని దీనివల్ల పేదవారు డాక్టర్ విద్య చదవలేరని ఉన్నత వర్గాల వారు మాత్రమే డాక్టర్లు అవుతారని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలను మూసి వేయడం వల్ల చిన్నతనంలోనే అనేకమంది విద్యకు దూరమవుతున్నారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీనివాసులు, భాస్కర్, ఫయాజ్, గౌస్ బాషా, ఇబ్రహీం, ఖలీల్, హరి గౌడ్, గీతా తదితరులు పాల్గొన్నారు.

సాయి సుధాలో వైద్య శిబిరం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : స్థానిక తిలక్ రోడ్‌లోని శ్రీ సాయి సుధా కంటి ఆసుపత్రిలో సుధారాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత రెటీనా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 50 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మధుమేహం ఉన్న వారిలో డయాబెటిక్ రెటినోపతి అనే కంటి వ్యాధి వస్తుందని, ఇలాంటప్పుడు రక్తంలో చక్కర స్థాయిలు రెటీనాలోని రక్తనాళాలను దెబ్బతీస్తాయని తెలిపారు. డయాబెటిక్ రెటీనోపతిని ప్రారంభ దశలో గుర్తించి, వైద్యం పొందాలని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే పూర్తిగా దృష్టిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. డయాబెటిస్ ఉన్నవారు ప్రతి 3 నెలలకు ఒకసారి తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో హాస్పిటల్ సిబ్బంది, విశ్వనాథ్, మహేష్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నారాయణ వనం మండలం, వెంకట కృష్ణ పాల్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ దర్శింవ రాజు, ఆధ్వర్యంలో శనివారం దోమల నిర్మూలన మలాథియన్ స్ప్రే చేయించారు. ఇంటింటికి లార్వా సర్వే ఫీవర్ సర్వే నిర్వహించారు. సబ్ యూనియట్ అధికారి మోహన్ బాబు జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు దోమలు కుట్టకుండా డ్రై డే పాటించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హరినాథ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: విలేకరులపై దురుసుగా మాట్లాడిన చిత్తూరు కలెక్టర్ వైఖరికి వ్యతిరేకంగా తిరుపతిలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్, వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ టి.జనార్దన్ తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మురళి, తిరుపతి ప్రెస్ క్లబ్ కార్యదర్శి బాలు, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు రాజేంద్ర, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి చంద్ర బాబు, సహాయ కార్యదర్శులు శీను బాబు, కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, బాలయ్య, విశాలాంధ్ర తిరుపతి ఎడిషన్ మేనేజర్ సుబ్బారాయుడు, చిత్తూరు జిల్లా కోశాధికారి వాసిశ్వర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎల్విన్ ఖాన్, ఉదయ్, జర్నలిస్టులు పాల్గొన్నారు. తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్ కుమార్ రాజు సంఘీభావం తెలియజేశారు.

బాలోత్సవంలో మోడల్ ప్రైమరీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతిలో గతవారం ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కాలేజీలో జరిగిన నాలుగవ బాలోత్సవం, పిల్లల పండుగలో కొర్లగుంట మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు అనేక విభాగాలలో పోటీపడి బహుమతులను అందుకున్నారు. సబ్ జూనియర్స్ చెస్ (చదరంగం) విభాగంలో వందలాదిమందితో పోటీపడి కొర్లగుంట ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థి శివకుమార్ మొదటి బహుమతిని పొందారు. చదరంగంలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థి శివకుమారును మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ నాయక్ ప్రశంసించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదర్ బాషా విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ఇస్తున్న శిక్షణను కొనియాడారు. మొత్తం 24 మంది విద్యార్థులు వివిధ పోటీలలో పాల్గొని ప్రశంసా పత్రాలు పొందడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు.

వివిఎం లెవెల్ - 2 పరీక్షకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - పాకాల: పాకాల మండలం, మొగరాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజ్ఞాన మంథన్ లెవెల్ -2 పరీక్షకు 8 మంది విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సుమలత తెలిపారు. విద్యార్థులను సమన్వయకర్త వసపద్ద వెంకట సిద్ధయ్య అభినందించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 28న పాఠశాల స్థాయిలో భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన విద్యార్థి విజ్ఞాన మంథన్ లెవెల్ - 1 పరీక్షకు, 6 నుండి 10 తరగతుల విద్యార్థులు 34 మంది హాజరు కాగా వారిలో 8 మంది విద్యార్థులు జాష్విని, ఇంతియాజ్, మహిత, జోత్స్న, వర్షిత, ప్రణీత, హర్షిత, ముకేశ్‌లు లెవెల్- 2పరీక్షకు ఎంపికయ్యారు.

శివయ్య సేవలో నందికొట్కూరు ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య శనివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికారు. ఏఈవో మోహన్ ముఖంటి జ్ఞాపికలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

బయో ఇన్‌పుట్స్ తయారీ కేంద్రం ప్రారంభం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, నీర్పాకోట పంచాయితీలో రైతుకు సంబంధించిన మిన్నల్ మోహన్ బయో ఇన్పుట్స్ తయారీ కేంద్రాన్ని శనివారం బిఆర్‌సి ఓనర్ మించల మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయ సహకారాలతో ప్రకృతి వ్యవసాయ విస్తరణలో భాగంగా మన మండలంలో ప్రతి పంచాయతీలోనూ ఒక బయో ఇన్పుట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. రైతులు రసాయనక ఎరువులకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయంగా పశువుల, ప్రకృతి వనరులతో సహజ సిద్ధంగాతయారు చేసే ఇన్పుట్స్ వినియోగించాలని సూచించారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్సి సెంటర్‌ను తిరుపతి జిల్లా డిపిఎం షణ్ముగం ఆదేశాలతో ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన జీవ ఉత్రే రకాలు ఘనజీవామృతం, ద్రవ జీవమృతం, పంటలో తెగుళ్ళకు నివారణకు వాడే కషాయాలు దశపర్ని, బ్రహ్మాస్త్రం, వావిళ్ళకు, వేప గింజల ద్రావణం. పంట ఎదుగుదలకు, దిగుబడి కి వినియోగించే పంచగవ్య, పుల్లటి మజ్జిగ, చేప బెల్లం ద్రావణం ప్రతి ఒక్కటి ఈ కేంద్రంలో లభించునని తెలిపారు. దేశీయ విత్తనాలు, పిఎండిఎస్ కిడ్స్, వ్యవసాయ పరికరాలు అందుబాటులో తెచ్చామన్నారు. భావితరాల మనుగడకు ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేస్తేనే భూమి ఆరోగ్యం, మన అందరి ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి షణ్ముగం, సంఘమిత్ర, ఆశ, గ్రామస్తులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రేవతి, జయలక్ష్మి, రజిని, మునిశేఖర్ రెడ్డి, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.

హెల్త్ కేర్ స్కిల్ పోటీల్లో బియన్ కండ్రిగ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: జిల్లా స్థాయిలో జరిగిన హెల్త్ కేర్ స్కిల్ పోటీల్లో బి యన్ కండ్రిగ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకి చెందిన ఒకేషనల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు శుక్రవారం సమగ్ర శిక్ష నిర్వహించిన జిల్లా స్థాయి స్కిల్ కాంపిటేషన్‌లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో బియన్ కండ్రిగ విద్యార్థులు మొదటి బహుమతి గెలుచుకున్నారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఒకేషనల్ టీచర్ చంద్రకళను, విద్యార్థులును ప్రధానోపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్స్, ఐటి విభాగానికి సంబంధించి జిల్లా స్థాయిలో పార్టిసిపేషన్ సర్టిఫికెట్ స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన పోట్లపూడి రాజేష్



ప్రజాశక్తి - నాయుడుపేట: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలవడం ఆనందంగా ఉందని, ఆయన ఆదరణ మరిచిపోలేనిదని తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణ టిడిపి యువ నాయకుడు, ఎస్.జె జువెలరీస్ అధినేత పోట్లపూడి రాజేష్ తెలిపారు. శనివారం నెల్లూరు నగరంలోని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నివాసంలో ఆయనను టిడిపి నేత పోట్లపూడి రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలవాకప్పి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజేష్ ను మంత్రి రామనారాయణరెడ్డి యోగ క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకోవడంపై ఆయన ఆనందం వెలిబుచ్చారు.

బాలికల సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : కర్ణాటక, కిట్టూర్ రాణి చెన్నమ్మ రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్ ఫర్ గర్ల్స్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలయిందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ యన్.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. 2026-2027 విద్యా సంవత్సరమునకు జాతీయ స్థాయిలో 2026 ఫిబ్రవరి 1న ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షకు 2014 జూన్ 1 నుంచి 2016 మే 31 మధ్య జన్మించిన విద్యార్థినులు అర్హులు అని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష 300 మార్కులకు ఉంటుందని ఇందులో మేథమెటిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ సబ్జెక్ట్‌లపై నుంచి ప్రశ్నలు ఇస్తారన్నారు. వివరాలకు, దరఖాస్తుల కొరకు తిరుపతి వరదరాజనగర్, విశ్వం సైనిక్ పోటీ పరీక్షల సమాచార కేంద్రాన్ని, లేదా 86888 88802 / 93999 76999 ఫోన్ నంబర్లను సంప్రదించగలరన్నారు.

పాశిం జస్వంత్‌కు గోల్డ్ మెడల్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పాండిచ్చేరి యూనివర్సిటీలో వైద్య విద్య అభ్యసిస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కుమారుడు జస్వంత్ కుమార్ గూడూరు ఖ్యాతిని ఇనుమడింప చేశారు. వైద్య విద్య అభ్యసిస్తున్న జస్వంత్ కుమార్ యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, ఎమ్మెల్యే సునీల్ కుమార్ అభిమానులు జస్వంత్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

రైతుల వినతులు పట్టవా పవన్..?

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెన్ను చూపి పారిపోయారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి హేమలత విమర్శించారు. ఆయన డిప్యూటీ సీఎమ్మా లేక సినిమా స్టారాని ప్రశ్నించారు. ఆయన కలెక్టరేట్‌కు వస్తారని తమ బాధలు చెప్పుకోవాలని చాలా మంది ఉదయం 10 గంటలకి కలెక్టరేట్‌కి తరలివచ్చారు. కానీ డిప్యూటీ సీఎం అభిమానులకు చేయి ఊపి వెళ్లినట్టుగా వెళ్లిపోవడమేమిటని మండి పడ్డారు. ప్రజలు తమ వినతులు ఇవ్వాలని వస్తే ప్రజానాయకుడు ఇలాగేనా ప్రవర్తించేదని ప్రశ్నించారు. జనం సమస్యలు ఆయనకు అక్కర్లేదన్నారు. 40 వేల మంది రైతులను 40మంది మామిడి గుజ్జు యాజమాన్య ఫ్యాక్టరీలు మోసం చేయడాన్ని గురించి చెప్పాలని వచ్చిన రైతులు, రైతు సంఘం నాయకులు నిరాశగా వెనుతిరిగారని ఆమె వాపోయారు. రైతులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని దుయ్యబెట్టారు. ఈ కార్యక్రమంలో మునీశ్వర్ రెడ్డి, జయదేవయ్య, రైతులు పాల్గొన్నారు.

జీతాల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలను మంజూరు చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర డిమాండ్ చేశారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పుత్తూరు పిహెచ్‌లో పనిచేస్తున్న కార్మికుల జనరల్ బాడీ సమావేశం శనివారం అంకమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సిహెచ్‌లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని, సౌకర్యం కల్పించాలని కోరారు. కనీస వేతనం రూ.18600 ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పుత్తూరు మండల కార్యదర్శి సిద్ధం చెట్టి చంద్రబాబు, ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు ఈ మహేష్, పద్మ, శీను,ఉమ తదితరులు పాల్గొన్నారు.

చర్మవ్యాధి సోకిన ఆవులకు చికిత్స

ప్రజాశక్తి - కోట : నెల్లూరుపల్లి, కొత్తపాలెం గ్రామంలో ఆవులకు వింత చర్మవ్యాధులు సోకడం కొన్ని లేగదుడలు చనిపోతుండడంతో, పాడి రైతుల అభ్యర్థన మేరకు వైసీపీ యువ నాయకులు నేదురుమల్లి హరీష్ రెడ్డి పశువైద్య అధికారులకు సమస్య తీవ్రతను తెలియజేసి వెంటనే నివారణ చికిత్సలకు చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే స్పందించిన పశువైద్య శాఖ సిబ్బంది శిఖామణి, రాజేష్‌లు శుక్ర, శనివారాల్లో గ్రామాల్లో పర్యటించి, చర్మ వ్యాధులు సోకిన ఆవులు, లేగ దూడలను పరీక్షించి, చికిత్సకు అవసరమైన మందులు, టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్మ వ్యాధులు సోకిన ఆవులు రోడ్ల మీద సంచరిస్తున్నాయని వాటి యజమానులు ఇంటివద్ద కట్టడి చేసుకోవాలని సూచించారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే స్పందించిన యువ నాయకులు హరీష్ రెడ్డికి పాడిరైతులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థినికి నగదు బహుమతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నారాయణవణం మండలం, జెడ్పీహెచ్ఎస్ అరణ్య కండ్రిగ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని కె.వసు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎస్.కె. మణి విద్యార్థినికి రూ.8,000 నగదు బహుమతిని అందజేశారు. అలాగే, పాఠశాలలో గతంలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసిన రాంబాబు వ్యక్తిగతంగా రూ.5,000 అందచేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును పాఠశాల తరపున అభినందించారు.

విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ నాయుడుపేట పట్టణ ఏఈ ఈ ఎన్.శివ శంకర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. నాయుడుపేట పట్టణంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ నుండి వెళ్లే 11 కెవి సప్తగిరి ఫీడర్ కండక్టర్ వైరు డ్యామేజ్ కారణంగా నూతన కండక్టర్ వైర్ మార్చుటకు, పట్టణంలోని సబ్‌స్టేషన్ నుండి వెళ్లే అన్ని 11కేవీ ఫీడర్ల లో అత్యవసర మరమ్మత్తుల చేసేందుకు ఉదయం 09 :00 గంటల నుండి 2:00 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని తెలియజేశారు. నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట, ఎల్ఏసాగరం, బీడీ కాలనీ, భూపయ్య కాలనీ, అగ్రహార పేట, పిచ్చిరెడ్డి తోపు, అమరా గార్డెన్, చంద్రమౌళి నగర్, విజయ గణపతి టెంపుల్, టీచర్స్ కాలనీ, బాలాజీ గార్డెన్, గాంధీ మందిరం, జైహింద్, పొగ గొట్టం, గరిడి వీధి, కోళ్ల ఫారం, ఆవని హోమ్స్, కాళహస్తి బైపాస్ రోడ్,హెచ్ పి పెట్రోల్ బంక్ ,రాజగోపాల పురం,శ్రీరామ్ నగర్,అశోక్ నగర్,విన్నమాల గేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఏర్పేడు : కందాడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. రాబోయే పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిలబస్ త్వరగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి, పిల్లలతో కలిసి భోజనం తిని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే రాజుల కండ్రిగ మోడల్ ప్రైమరీ పాఠశాలను సందర్శించారు.

పాఠశాలల బస్సులు నిబంధనలు పాటించాలి



ప్రజాశక్తి - నాయుడుపేట: స్కూల్ విద్యార్థులను బస్సులో ఎక్కించుకొని బస్సులను నడిపే డ్రైవర్లు వాహనాన్ని అతి వేగంగా నడిపి ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని పాఠశాలల యాజమాన్యానికి, వాహన డ్రైవర్లకు డిఎస్పి జి.చెంచుబాబు సూచించారు. తిరుపతి జిల్లా, నాయుడుపేట పట్టణంలోని ఏ.ఎల్.సి.ఎం హైస్కూల్ గ్రౌండ్లో డిఎస్పి చెంచుబాబు ఆధ్వర్యంలో శనివారం పోలీస్ శాఖ-రవాణా శాఖ సంయుక్తంగా ప్రైవేట్ స్కూళ్ల బస్సుల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ పాఠశాలల బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట ఆర్టీవో బి.అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులను నడపాలని తెలిపారు. డ్రైవర్లకు లైసెన్సు, డ్రైవర్‌కు సంబంధించిన ఫిట్నెస్ సర్టిఫికెట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఎమర్జెన్సీ విండో, ఫైర్ సేఫ్టీ, వంటి సదుపాయాలు ప్రతి స్కూల్ బస్సులో తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. నాయుడుపేట అర్బన్ సీఐ ఎమ్.బాబి మాట్లాడుతూ ప్రైవేటు స్కూలు యజమాన్యం అనుభవం కలిగిన సీనియర్ డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డి.ఎస్.పి,ఆర్టీవో,అర్బన్ సీఐ కలిసి ప్రతి బస్సును పరిశీలించి కండిషన్ ఎలా ఉందో తెలుసుకొని బస్సుకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రైవేటు స్కూలు యాజమాన్యం, డ్రైవర్లు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయం అంటే సంఘర్షణ కాదు.. ఆత్మీయత

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రాజకీయం అంటే ఇతరులతో సంఘర్షణ కాదు, ఆత్మీయతో మెలగటం అని వైఎస్సే ఆర్ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నాటరు. తిరుపతి పద్మావతి పురంలోని భూమన కరుణాకర్ రెడ్డి నివాసంలో ఇమామ్ పుస్తకావిష్కరణ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ఇమామ్ 77 ఏళ్ల వయసులో నవ యువకుడుగా ఉత్సాహంగా కొత్త ఆలోచనతో ఉన్నారని కితాబిచ్చారు. ఆయన రాయలసీమ స్ఫూర్తి, కమ్యూనిస్ట్ భావజాలంతో ముందుకు నడిచారని తెలిపారు. టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ ఇమామ్‌తో సుదీర్ఘ పరిచయం ఉందన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు గుర్తుండి పోయేలా జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు ఇచ్చారన్నారు. మాజీ మంత్రి ఆర్. కే.రోజా మాట్లాడుతూ ఇమామ్ కదలిక ద్వారా సమాజంలో ఎన్నో సంస్కరణలకు కారణం అయ్యారని తెలిపారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇమామ్ గొప్ప వాడని, ఆయన గొప్పతనం బ్రతికి ఉండగానే ముందుకు తీసుకు వచ్చారని కొనియాడారు. రాయల సీమ మేధావులు ఫోరం కన్వీనర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ఇమామ్ రాయలసీమ సమస్యలపై పోరాటాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి నగరం మేయర్ డాక్టర్ శిరీష, భూమన సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌డిహెచ్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి నగరంలోని దేవపట్ల హరినాథ రెడ్డి డిగ్రీ, పీజీ కళాశాల విద్యా సంస్థల చైర్మన్ డివిఎస్ చక్రవర్తి రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం విద్యా సంస్థలలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, పలు విద్యాసంస్థల అధినేతలు, శ్రేయోభిలాషులు, సన్నిహితులు, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు చక్రవర్తి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. రుయా ఆస్పత్రి వద్ద అన్నదానం చేశారు. కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ ఉషా మాట్లాడుతూ తమ విద్యాసంస్థలలో క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యను అందించడమే కాక, ఉద్యోగాలకు కావలసిన నైపుణ్యాలను నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొక్కిసలాటకు తావుండకూడదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని వచ్చే వేలాది భక్తుల మధ్య తొక్కిసలాటకు తావు లేకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఈవో బాపిరెడ్డి సూచించారు. శనివారం ఆయన ఆలయంలోని క్యూలైన్లను పరిశీలించారు. క్యూలైన్ల నిర్వహణపై సూచనలు చేశారు. కార్తీకమాసం.. వరుస సెలవు దినాలు కావడంతో ఆలయానికి భక్తుల రాక అధికంగా ఉంటుందనీ, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. క్యూలైన్లలో తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు.


కళ్యాణకట్ట, లడ్డూ కౌంటర్ వద్ద హెల్ప్ డెస్కులు

ప్రజాశక్తి -తిరుమల : తిరుమలోని కళ్యాణకట్ట, లడ్డూ కౌంటర్ వద్ద హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని అధికారులను టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు భక్తులకు ఎప్పటికప్పుడు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టీటీడీ అభిప్రాయ సేకరణపై ప్రత్యేక దష్టి పెట్టింది. ఐవీఆర్ఎస్, వాట్సాప్, శ్రీవారి సేవకుల ద్వారా భక్తుల నుండి క్రమంగా అభిప్రాయాలను సేకరిస్తోంది. ఈ నేపథ్యంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి పద్మావతి విశ్రాంతి భవనంలో శనివారం ఉదయం భక్తుల నుండి అక్టోబర్ నెలలో సేకరించిన అభిప్రాయాలపై విభాగాల వారీగా సమీక్ష నిర్వహించారు. కాలిబాట మార్గాల్లో పంచాయతీ, ఆరోగ్య విభాగాలు కలసి తరచూ తనిఖీలు నిర్వహించి ఆ మార్గాల్లోని దుకాణాల్లో వస్తువుల ధరలను పర్యవేక్షించాలన్నారు. అన్న ప్రసాద కేంద్రంలో భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించేటప్పుడు అన్న ప్రసాదం సిబ్బంది చేతులకు తొడుగులు ధరించి ప్రసాదాలు వడ్డించాలని సూచించారు. భక్తులు చేతులు కడుగు ప్రదేశం, హాళ్లలో తడి లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు.లగేజీ కౌంటర్ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా భక్తులకు సకాలంలో లగేజీ అందేలా సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని చెప్పారు. భక్తులు గదుల కాషన్ డిపాజిట్ తిరిగిపొందడంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా రిసెప్షన్ విభాగం చర్యలు తీసుకోవాలన్నారు. ఏటీసీ నుండి ఆక్టోపస్ సర్కిల్ వరకు ఉండే క్యూలైన్లలో భక్తులకు అన్న ప్రసాదం, తాగునీరు అందేలా అధికారులు నిత్యం క్యూలైన్లను పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా క్యూలైన్లు, కంపార్ట్ మెంట్లలో పరిశుభ్రత విషయంలో రాజీ పడకూడదని ఆదేశించారు. అన్న ప్రసాదం, ఆరోగ్య, విజిలెన్స్, క్యూలైన్ల నిర్వహణ, లడ్డూ కౌంటర్ విభాగాలపై వచ్చిన భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు.

శివా నాయక్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : బెంగళూరులోని బాల లత వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త శివా నాయక్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆ యూనివర్సిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా డాక్టర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివా నాయక్ తిరుపతి, హతిరామ్ బావాజీ మఠం పరిరక్షణకు కృషి చేశారని, కరోనా సమయంలో విశేష సేవలందించారని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి బెంగళూరులో డాక్టర్ బిరుదుతో సన్మానం చేసినట్లు తెలిపారు. డాక్టరేట్ తీసుకున్న డాక్టర్ శివ నాయక్ మాట్లాడుతూ డాక్టరేట్ సమాజంలో గౌరవ మర్యాదలు మరింత పెరిగేలా చేసిందన్నారు.

స్విమ్స్‌లో అనస్థీషియాలజీ చైర్ ఓరేషన్



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్ అనస్థీషియాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం "3వ వార్షిక బాలాజీ గోల్డ్ మెడల్ అనస్థీషియాలజీ చైర్ ఓరేషన్ శ్రీ పద్మావతి ఆడిటోరియం ఓపిడి బ్లాక్‌లో నిర్వహించారు. స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి.కుమార్, చైర్ ఓరియేటర్‌గా, మదురై నుండి ఎయిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.ఇ.ఓ. డా ఎం.హనుమంత రావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ కార్యక్రమానికి ప్రముఖ వక్తగా విచ్చేసిన డాక్టర్ ఎం. హనుమంత రావు అనస్థీషియాలజిస్ట్, అడ్మినిస్ట్రేటర్‌గా భారతదేశంలో అనస్థీషియా సేవలు, అకడమిక్ శిక్షణ, సంస్థాగత నాయకత్వ అభివృద్ధికి గణనీయమైన కృషి చేశారని కొనియాడారు.ఎయిమ్స్ హాస్పిటల్ ఈడి హనుమంత రావు అనస్థీషియా చరిత్ర, పరిణామం అనే అంశంపై ఉపన్యాసం అందించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ అలోక్ సచన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.రామ్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగానికి భయపడం : అంబటి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : రాష్ట్ర మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఏ ఒక్కరూ భయపడరని మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. తిరుపతిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారన్నారు. అధికారం శాశ్వతం కాదు కాస్త ఆలోచనతో నిర్ణయాలు తీసుకోవాలని హితావు పలికారు. ఏడాదిన్నర కాలంలోనే కూటమి పాలనపై ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. పవన్ కళ్యాణ్‌తో 15 ఏళ్లు కాదు జీవితాంతం కలిసే ఉండండి మాకేం నష్టం లేదని తెలిపారు. మీరు కలిసి ఉంటేనే.. మేము బలపడతాం అని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్‌ను చూసి ఓటేశారు, కాపులను చంపితే మీరు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మీ పోరాట పటిమని గంగలో ముంచేయండి అని ధ్వజమెత్తారు.

క్రైం న్యూస్

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి



ప్రజాశక్తి-ఏర్పేడు: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఏర్పేడు మండలం, మేర్లపాక టోల్గేట్ సమీపంలో చోటు చేసుకుంది. ఏర్పేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనివారం తెల్లవారుజామున 12.30 గంటల సమయంలో పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై మేర్లపాక దళితవాడకు దగ్గర ఒక వ్యక్తిని, గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తికి బలమైన రక్త గాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. సదరు వ్యక్తి ఎవరన్నది తెలియ రాలేదని తెలిపారు. వివరాలు తెలిసినవారు ఏర్పేడు పోలీస్ వారిని సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు.

మద్యం మత్తులో పై అంతస్తు నుండి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన మహేంద్ర

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని, ఆటోనగర్, పూలవాని గుంట వద్ద మద్యం మత్తులో ఓ వ్యక్తి.. పై అంతస్తు నుండి కింద పడి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ప్రకాశం జిల్లా, మర్రిపూడి మండలానికి చెందిన మహేంద్ర మేస్త్రీగా పనులు చేస్తు జీవనం సాగిస్తున్నాడు. పూలవాని గుంటలో ఉన్న బాబాయి పిన్నిల దగ్గర ఉండి పనులు చేసుకునేవాడు. స్నేహితుడి ఇంటి వద్ద శుక్రవారం రాత్రి మద్యం సేవించి, మత్తులో మొదటి అంతస్తు నుండి ప్రమాద వశాత్తు క్రింద పడటంతో తీవ్ర రక్తస్రావమైంది. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన చంద్రశేఖర్

ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతిజిల్లా, నాయుడుపేటలో నూతనంగా నిర్మించిన జాతీయ రహదారి ఫ్లై ఓవర్ కింద అనుమానాస్పద స్థితిలో శనివారం ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు విచారణ చేసి లభ్యమైన ఆధారాలతో మృతుడి మరణానికి కుటుంబ కలహాలే కారణమని ప్రాథమికంగా అంచనా వేశారు. మృతుడు సత్యవేడు మండలం మదనపాలెం గ్రామానికి చెందిన నీడిగింటి చంద్రశేఖర్ (47)గా గుర్తించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఈ మధ్యకాలంలోనే కుమార్తెకు వివాహం జరిగిందని, కుమారుడు చదువుకుంటున్నాడని, మృతుడు సత్యవేడులో ఒక కంపెనీలో వాచ్మెన్‌గా పనిచేస్తుండేవాడని, మృతుని భార్య కూడా శ్రీ సిటీ లో హౌస్ కీపింగ్‌లో పనిచేస్తోందని తెలిపారు. మృతుడు నిత్యం మద్యం సేవిస్తుండటంతో, భార్యాభర్తలు ఇరువురు తరచూ గొడవలు పడే వారిని తెలిపారు. ఈ గొడవల కారణంగా మృతుడు అప్పుడప్పుడు ఇల్లు వదిలి వెళ్ళిపోయి మళ్లీ తిరిగి వచ్చేవాడని మృతిని భార్య తెలిపినట్లుగా చెప్పారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం జరిగిన గొడవలో ఇల్లు వదిలి వచ్చేసి, శుక్రవారం రాత్రి మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఉండవచ్చునని తెలిపారు. ఘటనా స్థలంలో విషం బాటిల్ దొరికినట్లు పోలీసుల తెలిపారు. మృత దేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీరే ప్రాణాధారం



రెయినీ డే కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారమని ఆక్స్ ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూల్ అధినేత చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి అన్నారు. స్థానిక పాఠశాలలో శనివారం రైయినీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులు గొడుగులు, రైయిన్ కోట్లు ధరించి అలరించారు. చిన్నారులనుద్దేశించి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టడం భావితరాలకు ఎంతో అవసరమన్నారు. చిన్నతనం నుంచే నీటి ఆవశ్యకతను తెలుసుకొని మసులుకోవాలని సూచించారు.

ఘనంగా దిలీప్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు కుమారుడు, ఎస్సీవి దిలీప్ నాయుడు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఎస్సీవీ వివాసంలో భారీ ఎత్తున హాజరైన అభిమానుల మధ్య దిలీప్ కేక్ కట్ చేశారు. అభిమానులకు స్వీట్లు పంచిపెట్టారు. పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. టిడిపి నేతలు సత్రవాడ ప్రవీణ్, భాస్కర నాయుడు, నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రెండవ శనివారం తరగతులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): గత వారంలో తుఫాను ప్రభావంతో పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఆ శెలవులను భర్తీ చేసేందుకు రెండవ శనివారం అధికారులు పాఠశాలలు జరపాలని ఆదేశాలిచ్చారు. దిగువ సాంబయ్య పాళెంపాఠశాలలో తరగతులు నిర్వహించారు.